క్లుప్తంగా

శరవేగంగా కౌంటింగ్ ఏర్పాట్లు



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ

తిరుపతి సిటీ: తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు అధికారులతో కలసి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయని, జూన్ ఒకటిలోపు సర్వం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఐదంచెల భద్రతతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుండగా, కౌంటింగ్ ప్రక్రియను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న శంకర్ యాదవ్

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం లీలామహల్ సర్కిల్‌లో అఖిల భారత యాదవ మహాసభ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో అమ్మవారి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో శంకర్ యాదవ్ యువసేన, స్నేహితులు, మిత్రులు పాల్గొన్నారు.

విసనకర్రలు, మెడిమిక్స్ సోపుల వితరణ.. తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని మెడిమిక్స్ వారిచే మంగళవారం అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు విసనకర్రలు, మెడిమిక్స్ సోపులు వితరణ చేశారు. సుమారు 6 వేలు విసనకర్రలు, 10 వేల మెడిమిక్స్ సోపులు ఉచితంగా పంపిణీ చేశారు. సేల్స్ మేనేజర్ రాజేష్‌సూర్య, ఏఎస్ఓ కేఎంఎస్ నాయుడు, టీఎస్ఐ బాల మయురాన్, డిస్ట్రిబ్యూటర్ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం కల్పిస్తాం



చంద్రగిరిలో ఫ్లాగ్‌మార్చ్

చంద్రగిరి: సాధారణ ఎన్నికలు ముగిసినప్పటికీ గ్రామాల్లో అలజడులు జరుగుతుండడంతో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని చంద్రగిరి సీఐ రామయ్య తెలిపారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరగనున్న నేపథ్యంలో చంద్రగిరిలో సీఐ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాయుధ బలగాలతో కలసి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికలు ముగిసినప్పటికీ శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల లెక్కింపు క్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా నిరంతరం పోలీసు నిఘా ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర సాయుధ బలగాలు సైతం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే అల్లరి మూకలు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎవరైనా ఎటువంటి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అంతకముందు ఏ.రంగంపేట గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించి, అనుమానితులను విచారించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిత, పోలీసు శాఖ, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నాయి.

భక్తులకు అంబలి పంపిణీ



భక్తులకు అంబలి పంపిణీ చేస్తున్న సాయిబాబా సేవాసమాజ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా శ్రీద్వారకామయి శ్రీషిర్డీ సాయిబాబా సేవాసమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి భక్తులకు పెరుగు అంబలి పంపిణీ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అంబలి పంపిణీ చేసి అమ్మవారి పట్ల తమ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో సేవాసమాజ్ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, బాలకృష్ణ, దుర్గం శ్రీనివాస్, శివ, విజయలక్ష్మి, రమేష్, హరిబాబు, రాజారాణి, వెంకటముని, సభ్యులు పాల్గొన్నారు.





కరుణించు గంగమ్మ తల్లీ..

నిత్యం భక్తి పారవశ్యంతో తిరుపతి పట్టణం మంగళవారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర ఈనెల 14వ తేదీ రాత్రి చాటింపుతో మొదలైంది. వారం రోజుల పాటు అత్యంత కోలాహలంగా సాగిన జాతర ముగింపు దశకు చేరుకుంది. దీంతో భక్తులు అమ్మలుగన్న అమ్మ.. మూలపుటమ్మ.. గంగమ్మ అంటూ మొక్కులు తీర్చుకున్నారు. భారీగా జంతుబలులు సమర్పించారు. ఆలయ అధికారులు, పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. - తిరుపతి కల్చరల్

అమ్మవారి కొడిస్తంభం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు









కర్పూర జ్యోతులు వెలిగించి మొక్కుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడాచైర్మన్ మోహిత్‌రెడ్డి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

సప్పరాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు







అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు, చిన్నారులు



అమ్మవారి కొడిస్తంభం వద్ద మొక్కుతున్న భక్తులు





ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వద్ద పొంగళ్లు పెడుతున్న భక్తులు



భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, అమ్మవారికి దండం పెడుతున్న చిన్నారి

చిన్నగొట్టిగల్లులో గంగ జాతర

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులో తిరుపతి గంగమ్మకు మహిళలు బోనాలు తీసుకొచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం వేకువ జామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. గ్రామంలో మహిళలు తెల్లవారుజాము నుంచే బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి గ్రామంలో తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని బోనాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు.

రామిరెడ్డిపల్లిలో ఎస్పీ పర్యటన



పికెటింగ్ చేస్తున్న సిబ్బందికి మార్గదర్శకాలను చేస్తున్న ఎస్పీ

- పోలీసు బందోబస్తు తనిఖీ

చంద్రగిరి: ఎన్నికల పోలింగ్ తర్వాత అల్లర్లు జరిగిన చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కూచువారిపల్లి, రామిరెడ్డి పల్లి గ్రామాలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మంగళవారం రాత్రి సందర్శించి, అక్కడ పోలీస్ పికెట్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, అలాగే స్థానికులతో రాజకీయపరంగా ఎలాంటి విషయాలు చర్చించకుండా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చంద్రగిరి సీఐ రామయ్య ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో మంగళవారం చంద్రగిరి టౌన్, వెంకటంపేట ప్రాంతాల్లో పోలీసులు కవాతు (ఫ్లాగ్ మార్చ్) ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల అదనపు ఎస్పీ కులశేఖర్, చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్ కుమార్, ఎస్బి సీఐ శ్రీనివాసులు, చంద్రగిరి సీఐ రామయ్య, సీఐఎస్ఎఫ్ సీఐ శంకర్ ప్రసాద్, చంద్రగిరి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.



సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి నివాసం వద్ద టీడీపీ గుండాలు తగలబెట్టిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ విష్ణు వర్ధన్ రాజు

నేడు తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి ఉత్సవాలు

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అపర భక్తురాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు మే 22వ తేదీన తిరుమలలో వైభవంగా జరుగనున్నాయి. బుధవారం మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు టీటీడీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి బుల్లెమ్మ బృందం తరిగొండ వెంగమాంబ సంకీర్తనలను ఆలపించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానంలోని పద్మావతి వేంకటేశ్వర పరిణయోత్సవ మండపానికి ఉభయనాంచారీ సమేతంగా శ్రీవారు పురవీధుల గుండా వేంచేపు చేస్తారు. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం చేస్తారు. రాత్రి 7 గంటలకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామిజీ అనుగ్రహభాషణం చేయనున్నారు.

బయోవేస్ట్ సెగ్రిగేషన్‌కు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



డస్ట్‌బిన్లను నర్సింగ్ స్టాఫ్‌కు అందజేస్తున్న రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ, సెగ్రిగేషన్ చేపట్టేందుకు అధికారులు ఎట్టకేలకు చర్యలకు దిగారు. బయో మెడికల్ వ్యర్థాల సెగ్రిగేషన్ కోసం నాలుగు రంగులతో కూడిన డస్ట్‌బిన్లను మంగళవారం సిబ్బందికి పంపిణీ చేశారు. రుయా ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్ట్ ప్రమాదకరంగా మారడంతో నాలుగు రోజుల క్రితం సాక్షి 'బయోత్పాతం' శీర్షికతో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు చర్యలకు దిగారు. రుయాలో చెత్త నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.55 లక్షలకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అలానే రోగులకు ఉపయోగించే మెడికల్ వ్యర్థాల నిర్వహణ కోసం అదనంగా లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయితే ఆశించిన స్థాయిలో రుయాలో పారిశుద్ధ్యం అమలు కావడం లేదు. అలానే బయో వ్యర్థాల నిర్వహణను పూర్తిగా విస్మరించారు. సాక్షి కథనానికి స్పందించిన రుయా సూపరింటెండెంట్ చెత్త నిర్వహణ కాంట్రాక్టు సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం బయో వేస్ట్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో రంగంలోకి దిగిన యంత్రాంగం ఏ బయో వ్యర్థాన్ని ఏ రంగు డస్ట్‌బిన్‌లో వేయాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. బుధవారం నుంచి వంద శాతం బయోమెడికల్ వేస్ట్ సెగ్రిగేషన్ జరిగి తీరాల్సిందేనని నర్సింగ్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే వ్యర్థాలను ప్రతిరోజు కాంట్రాక్ట్ సంస్థ బయో మెడికల్ వేస్ట్‌ను తరలించేలా చర్యలు తీసుకున్నారు. అత్యవసర విభాగంతో పాటు రుయాలోని అన్ని వార్డుల్లో ఇవి ఉండి తీరాల్సిందేనని ఆయన కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి సూచించారు. అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణ, చిరంజీవి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర

పాకాల: కమతం పల్లిలో గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. గ్రామ దేవత సత్యమ్మను రంగురంగు పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి అంబలి నైవేద్యం సమర్పించి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. అలాగే పొంగళ్లు పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి కర్పూర హారతులు పట్టి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.